# సౌందర్యోపాసకుడు

## సులోచన

వాడి భార్య తిలోత్తమ కాదు. మేనకలో వున్న మెత్తందనమూ, వరూధినిలో వున్న వయః సౌందర్య సౌష్ఠవమూ, అప్సరసల్లోని అపూర్వ లావణ్యమూ వాడి భార్యలో లేవు. వాడి భార్య వక్షాలు అజంతా ఎల్లోరా గుహల్లోని ఆడవాళ్ళ వక్షాల్ని పోలివుండవు.

ఏ అందమైన కళలాన్నీ, అవయవాన్నీ వాడు వాడి భార్యలో చూడలేకపోగా, తృప్తిచెందక పోగా; ఇతరత్రా ఆడవాళ్ళని చూచి తన భార్యతో పోల్చుకోలేక పోల్చుకొని సిగ్గుపడుతాడు, అవమానాన్ని పొందినట్టు భావిస్తాడు. క్రుంగిపోతాడు.

వాడి భార్యకళ్లు శశివారి జాల్లాగా వుండవు, అగాధాన్ని అన్వేషించవు. ఆకర్షణకి పనికి రావు శరీరం ఉన్నతంగా మెరిసిపోదు. చెంపలు మెత్తగా వుండవు ముఖం పాలిపోయివున్న మాటటుంచి చెదలు తిన్న ముఖంలాగ వుంటుంది. శరీరం లోపలభాగాన్ని కొద్ది తప్పులతో లెక్కించవచ్చు-అంటే ఆమె అంత బలహీనంగా పలచగా వుంటుందన్నమాట. అదీ వాడి భార్య!

వాడి భార్యగా ఈమె రాకముందు, వాడు చాలామంది ఆడవాళ్ళని ప్రేమించాడట. తెల్లగా మెరిసే చెంపలవాళ్ళనీ, మెరుపులుకు తిరిగిన ఛాయవాళ్ళనీ, వొంకుల నల్లని జుట్టువాళ్ళనీ, నర్గీస్ ముక్కులాగ నాజూగ్గావున్న ముక్కుగల వాళ్ళనీ, ఎర్రని బుల్లి పెదవుల వాళ్ళనీ-ఇంకా తనకు గొప్పగా కనపడ్డవాళ్ళనీ, 'వీళ్ళు నాకు మహత్తర సౌఖ్యాన్ని ప్రసాదిస్తారు. వీళ్ళవల్ల నేను ఆనంద సాగరాల్లో మునిగి తేలవొచ్చు' అని అనుకొన్న వాళ్ళనీ: ప్రేమించాడట. కాని వాళ్ళుగూడా ప్రేమించకపోవడంచేత, వాళ్ళ కళ్ళల్లో, హృదయంలో - పీడు, పీడివర్చుస్సు, భావాలు అంతం-నిలవలేక పోవడంచేత, తమకు నచ్చినవాళ్ళనీ, తమ తలిదండ్రులకు నచ్చిన వాళ్ళనీ పెళ్లాడారు. పీడు పీడుగానే, భావాలు భావాలుగానే, కోర్కెలు కోర్కెలుగానే, మాటలు మాటలుగానే-వుండిపోయినయ్.

'ఇప్పుడేమనుకొంటే ఏంలాభం?' అని అనుకొన్నవాడు-నిలువునా క్రుంగిపోయి, 'ఇహ తను జీవితంలో పెళ్ళిచేసుకోను!' అని నిశ్చయంగా తీర్మానించుకొని; కొన్నాళ్లటికి వాడే - ఈమెను పెళ్లాడాడు.

అందుకు కారణాలు వాడు చెప్పేవి, ఏమీ వుండవుగాని, వాడి తండ్రి చెబుతాడు-'నిజమైన కారణాల్ని: "పిల్ల అటే అందగత్తె కాకపోయినప్పటికీ మాకు వొచ్చిన యిబ్బంది ఏం లేదు. వాళ్లు మేం కోరిక కట్నాలూ, కానుకలూ ఇవ్వగలిగేవారు!' ఇది నిజానికి వాడికి నచ్చకూడదు. 'తను పెళ్ళి విషయంలో చూచేది కట్నంకాదు, చివరకు ఆవకలవాళ్లు ఏమీలేనివాళ్లయినా సరే కావాల్సింది పిల్ల, మంచిదిగా వుండటమే' అన్న భావాలు గలవాడు-'కులాన్ని కూడా ప్రధానంగా నేను చూడను. ఆస్తిని అసలే లెక్కించను. పి[illegible]గ వుంటేచాలు!' అని రాయి గుద్దేవాడు, అటువంటి భార్యను పొందకుండా, పొందేందుకు ప్రయత్నించకుండా-కొసకు తనను తానే మోసంచేసుకొని, తనకు తానుగానే పిరికితనాన్ని కొని తెచ్చుకొని, తండ్రికి భయపడి ఈమెను భార్యగా స్వీకరించాడంటే, వాడి మనస్తత్వం బయటపడుతుంది.

వాడు. వాడిభార్యను కాపరానికివచ్చిన ఆరు నెల్లవరకూ ప్రేమించాడు, ప్రేమించగలిగాడు. ఆపైన భార్య శరీరం నల్లగా వుండేట్టు-చెక్కిళ్లు లోపలికి పోయినట్టు, జుట్టు రాగి రంగుకు తిరిగినట్టు, చేతులు సన్నబడ్డట్టు. వక్షంపైని వొంపుల్లో, మెడక్రింద, మెరుగులు తగ్గినట్టు-అగుపడింది దానితోపాటు వాడికి ఈ పెండ్లి తను తండ్రి బలవంతంవల్లే చేసుకున్నట్టు, తన కిష్టం లేకపోయినా మనస్సుతో తిరుగుబాటు చేసి అంగీకరించినట్టు, మెల్లమెల్లగా తెలిసి వస్తూన్నది.

వాడు ఏ ఆఫీసులోనూ పని చేయాల్సిన అవసరం లేదు. ఇంత ఆస్తి వున్నది. చదువుకున్న వాడు. స్కూలు ఫైనలు ప్యాసై, ఓవర్సీరు కోర్సు ప్యాసై - అవసరం అనుకున్నాక ఉద్యోగం చేసే ఉద్దేశంతో వూరుకున్నాడు.

ఇంటిదగ్గర ఇవతల పుల్ల అవతల పెట్టే పని లేదు వాడికి. నీళ్ళు తోడటానికి బజారుకుపోయి వెచ్చాలు తీసుకురావటానికీ అజీలుగా పని మనిషి. ఇంకా ఇతరత్రా చిల్లరమల్లర యింటి పనులు చేయడానికికూడా ఒకడు ఉన్నాడు. పొలం వ్యవహారం తండ్రిది. ఇక వాడు రోజు రోజంతా ఇంట్లో కదలకదిలా భార్యను చూస్తూ కూచోవటమే.

'ఎప్పుడూ నన్ను చూస్తూ కూర్చోకపోతే! ఏదో కోర్సుకూడా ప్యాసయ్యారు గామోసు!- ఉద్యోగం చేయరాదటండీ?' అన్నది వాడి భార్య ఒకరోజు.

వాడికి కోపం వొచ్చింది. తన భార్య అందకత్తె కాదని, ఉన్న అందంకూడా పోయిందని తెలిసికూడా తను చూస్తున్నాడట పదేపదే. అదటుంచి తను ఎలాగుంటే ఏం? ఉద్యోగం చేస్తే ఏం? చేయకపోతే ఏం?-మధ్యన దీనికెందుకు? వేనకువేలు డబ్బు ధారబోసి చదువు చెప్పించిన తండ్రే ఉద్యోగం చేయమనకపోయె! - ఇవాళ ఎటొచ్చీ మధ్యన ఇదా తనని ఉద్యోగం చేయమనేది? అసలు ఈప్రశ్న అడగటానికి దానికి గుండెలు ఎక్కణ్ణుంచి వొచ్చాయి?

'నాకేం కర్మ కాలిందీ, ఉద్యోగం చేయటానికి? తిండికి కరువా? గుడ్డలకు లోటా?

'ఇక నీతో అందులో నీలాంటి అందమైన భార్యను పెట్టుకొని ఉద్యోగాలు చేసి, వూరూరు తిరిగి-నవ్వించుకో నక్కర్లేదు!' అన్నాడువాడు.

వాడి భార్యకు రోషంవచ్చింది. 'నన్ను చేసుకొంటేనే అంత నామూషీ వొచ్చింనన్న వాళ్ళు, ఎందుకు చేసుకున్నారు? - డబ్బుకు ఆశ పడి చాలా కట్నాం వొస్తుందని కాదూ?'

'చాలు ఇక మాట్లాడకు నీ మొఖానికితోడు వాదన! ఎదురుతిరిగి మాట్లాడ్డం!

'ఇదుగో చెబుతున్నా! నీలో అందంలేదు, చందంలేదు. నిన్ను చేసుకోవటానికి నేనెందుకు అంగీకరించానో నాకే తెలీదు. అయినా నీ శరీరం ఇంత తొందర్లో చెడిపోతుందని అనుకోలేదు. నువ్వు నాకు ఈ కొద్ది రోజుల్లోనే ఇంత అసహ్యం వేస్తావని తలంచలేదు. నేను సౌందర్యారాధకుడను. సౌందర్యాన్ని ప్రేమిస్తాను. అందాన్ని ఆకర్షిస్తాను. అనుభవించటానికి అర్రులు చాస్తాను. అటువంటి నాకు ఇటువంటి భార్య!'

బిగ్గరగా, గదంతా దద్దరిలేటు నవ్వుతున్నాడు వాడు.

వాడిభార్య కిదంతా అర్థం కావటంలేదు. ఇలాగ తనభర్త తనని అంటం చాలాసార్లు విన్నది, కాని ఇలా వెకిలిగా నవ్వటం వినలేదు.

'ఇతర స్త్రీలను చూచి, వాళ్ళ అందాన్ని మెచ్చుకొని ఉవ్విళ్ళూరుతూ ఆ అందాన్ని నీలో చూసుకొని, అటువంటిదానివి నువ్వు కాని-నిన్ను ఎన్నాళ్ళనుభవించి తృప్తిపడతాను.'

ఇదంతా వాడు-తన భార్యకు అర్థమవుతుందనీ, అవ్వాలనీ అంటున్నాడు. కాని ఆమెకు అయోమయంగా వుంది.

తన భర్తను మెప్పించి, భర్త హృదయంలో హత్తుకుపోయి, తన భర్త తనను తప్ప ఇంకెవ్వర్నీ ప్రేమించకుండా ఉండేట్టు హఠాత్తుగా తను ఎలా మారాలో ఆమెకు అర్థం కావడంలేదు.

* * *

వాడిభార్య తిలోత్తమ కాని మాట నిజమే, వాడిభార్యలో అందంలేని మాటా నిజమే! కాని అంతమాత్రంచేత వాడు నవమన్మధుడూ- ప్రవరుడూ, నలకూబరుడూ కాడు. వాడి అందం మెరిసిపోయి ప్రతి ఆడదాన్నీ ఆకర్షించదు కాని వాడిది ఆలోచించడు. ఎంత సేపటికీ తన భార్యలో అందం లేదంటాడు.

వాడు పరస్త్రీ సాంగత్యానికి- డబ్బు వ్యయ పర్చ మరీ వెళుతున్నాడు; తన భర్త తనలో అందంలేదని పరస్త్రీలను అనుభవించుతున్నాడు, అని వాడి భార్యకూ తెలుసు. పోతే, ఆమె ఎన్నడూ అడ్డుపెట్టలేదు. 'మీరు అడ్డమైన ఆడదాని వెంటబడి, డబ్బును ధారపోస్తున్నారు. వంశానికి అప్రతిష్ఠ తెస్తున్నారు.' అని ఎన్నడూ అనలేదు.

భార్యలో ఈ గుణం వున్నందుకు వాడు సంతోషపడ్డాడు. చాలామంది స్త్రీలు, తన

భర్త పరాయి ఆడదానిని అనుభవించుతున్నాడు అని ఏ కొంచం తెలిసినా 'చెడిపోతున్నాడు- డబ్బును ధ్వంసంచేస్తున్నాడు' అని నిర్ణయించుకొని, భర్తని సక్రమమార్గంలోకి తేవటానికి నానాఅవస్థలూ పడతారు. నీతిని గురించీ, వంశాన్ని గురించీ, ఆస్తిని గురించీ- తాము ఉపన్యాసాలిస్తారు, పెద్దమనుష్యులచేత చెప్పిస్తారు. తగువులాడుతారు. ఉపవాసాలుంటారు. ఇవేవీ జరుగనందుకు, తన భార్య అలా తయారుకానందుకు ఎంతో గర్వించాడు.

వాడిభార్య గర్భవతి అయింది. ఆరో నెల. వాడి కళ్ళకు మరీ అసహ్యంగా కనబడ్డది. అంచాత ఏ శుభకార్యానికీ, పేరంటానికీ పోనివ్వకుండా కట్టుదిట్టం చేశాడు.

రానురాను వాడికి కొన్ని భయాలు కూడ పుట్టసాగినయ్. తనభార్య చూస్తే ఈరకంగా ఉంది. ఇక పుట్టే పిల్లో, పిల్లాడో ఇంకెలా వుంటారో? పిల్లాడైతే ఎలాగున్నా ఫరవాలేదు, పిల్లయితే దాన్ని పెంచి పెద్దదాన్నిచేసి పెళ్ళి చేసేసరికి తాడు తెగుతుంది. కురూపియైన పిల్లను ఎవడు పెళ్లి చేసుకోటానికి ముందంజ వేస్తాడు?

తన శరీరాన్ని తను మోసుకోవటానికే వాడి భార్యకు భయంగా వున్నది. తన భర్త అడ్డమైనదాని వెంటల్లా పోవడంచాత, వాళ్ళకున్న సుఖరోగాలు తన భర్తకు కూడా వొచ్చాయనీ, అవి తనకుకూడా ప్రాప్తమైనాయనీ,- ఆమె అనుకోగలదా? నమ్మగలదా? వాడుమటుకు తనే తన భార్య అందాన్ని ధ్వంసంచేశాడు, తనకున్న రోగాలవల్లే ఆమెలో వున్న కాస్త అందం నాశనం అయింది. అని నమ్మగలడా? ఆలోచించగలడా?

వాడిభార్య ప్రసవించింది దుర్ముహూర్తంలో. నక్షత్రం మంచిదిగాదు. ఆడపిల్లను కన్నది. ఆ పిల్లకు కాళ్లు కలుసుకొని పోయినయ్. వాడు ఎంత క్రుంగిపోయాడో చెప్పటానికి వీల్లేదు. కాని ఆ పిల్ల నాలుగోనాడే చనిపోయింది. వాడు ఎంత మాత్రమూ విచారించలేదు.

ఆపైన అయిదురోజులకు వాడి భార్యకూడా చనిపోయింది, బాలింత జబ్బుతో. అయినా వాడు ఏవిధమైన దిగులుకూ లోనుకాలేదు. 'పైన పెంకుటిల్లు దూలాలువూడి భార్యమీద పడితే!- భూమి భార్యనుంచున్న వరకూ క్రుంగి పాతాళలోకానికిపోతే! హఠాత్తుగా సన్నిపాత జ్వరం తగిలి గంటలో చస్తే!- తను మరో పెళ్ళాన్ని చేసుకోవచ్చు!' అని భార్య బతికిఉన్న రోజుల్లో భగవంతుణ్ణి కోర్కెలు కోరిన వాడికి ఈనాడు భార్య బాలింతజబ్బుతో చస్తే సంతాపానికి బలికావాల్సిన అవసరం దేనికి?

# "ఆంధ్రలో హరిజనోద్ధరణ"

కె. జి. సత్యమూర్తి 29-12-50

డిసెంబరు 8వ తేదీ 'తెలుగు స్వతంత్ర'లో శ్రీ జి. కృపాలినీగారు ఆంధ్రలో హరిజనోద్ధరణ, హరిజన విద్యార్థుల హాస్టల్సు నిర్వహణ, మద్రాసు ప్రభుత్వం అలసత గురించి కొన్ని అమూల్యవిషయాలు తెలియజేశారు. ఆ వ్యాసము చదివిన తరువాత ఈ క్రింది విషయాలు వ్రాయటం అవసరంగా తోస్తున్నది.

మద్రాసు ప్రభుత్వం పదేండ్ల విద్యావిధాన ప్రణాళిక చివరకు హరిజనుల పేరుమీద ఎవరో కొందరు స్వార్థపరులైన 'హరిజనేతరులు' కుబేరులు కావడానికి సహాయపడుతున్నది అని శ్రీ కృపాలినీగారు ప్రస్తావించారు. ఇక్కడ మరువరాని విషయం మరొకటి ఉంది. ఈ ప్రణాళిక ద్వారా సామాన్య హరిజన ప్రజలను ముందు పెట్టుకొని 'కుబేరు'లగుతున్న స్వార్థపరులైన హరిజనుల గురించికూడా మర్చిపోకూడదు.

ప్రజల సొమ్ముతో పొట్ట నింపుకోవాలని చూసే ఘనుడు హరిజనుడైనా, హరిజనేతరుడైనా ప్రజలముందు చేతులు కట్టుకొని నిలబడ వలసిన దోషే! ప్రభుత్వం హరిజనులకోసం వెచ్చి